క్లుప్తంగా

వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన



వివాహ పరిచయ వేదికలో మాట్లాడుతున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. విశ్వకర్మ ఫౌండేషన్ చైర్మన్ అండలూరి రవీంద్రాచారి, హైదరాబాద్ వారిచే వెంకట సుబ్బారావు, బెంగళూరు వారి ఆర్థిక సహకారంతో ఒంగోలు ధీరజ్ హాస్పిటల్ దగ్గర ఎల్బీజీ భవన్లో ఏర్పాటు చేశారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, విజయవాడ మెట్రోపాలిటీ మేజిస్ట్రేట్ శ్రీదేవి నరసింహారావు, పాల్గొన్నారు. వివాహ పరిచయ వేదికలో 200 మంది పాల్గొనగా, సంఘ జిల్లా నాయకులు ఏలూరి వీరబ్రహ్మాచారి, ఉద్యోగ సంఘ నాయకుడు చోడా వెంకట సుబ్బారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫణిదపు సుధాకర్, బి.వెంకటేశ్వర్లు, తాతాచారి రిటైర్డ్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ సామంతపూడి రమేష్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కులు - చట్టాలపై అవగాహన అవసరం



బాలలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: బాలల హక్కులు - చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డులోని బొమ్మరిల్లు నిరాశ్రయుల బాలలకు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ ఆధ్వర్యంలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ పాల్గొని మాట్లాడుతూ వివిధ చట్టాలు - హక్కుల గురించి అవగాహన కలిగించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పోలీసు వ్యవస్థ - దాని పనితీరుపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై, లైంగిక వేధింపుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా చైల్డ్ లైన్ 1098, పోలీస్ టోల్ ఫ్రీ 112కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బొమ్మరిల్లు నిర్వాహకులు రాజ్యలక్ష్మి, కాశీం, టూటౌన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలు-కర్నూలు రోడ్డు పక్కన చీమకుర్తి సమీపంలో ఎండిపోయిన భారీ చెట్టు



సంతనూతలపాడు చెరువు దాటిన తర్వాత...



సంతనూతలపాడు పశువుల సంతసమీపంలో...



తొర్రగుడిపాడు వెళ్లే రోడ్డు పక్కన...

పచ్చదనం పోయి.. ప్రమాదాలు మిగిలి..!

- పేర్నమిట్ట నుంచి చీమకుర్తి వరకు సుమారు 30కిపైగా ఎండిపోయిన భారీ వృక్షాలు
- విరిగిపడిపోయే స్థితికి చేరి ప్రమాదకరంగా మారిన వైనం
- ఒంగోలు-కర్నూలు రోడ్డుపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

ఒంగోలు సబర్బన్:

చెట్లు నాటడమంటే గుర్తుకొచ్చేది అశోక చక్రవర్తి. ప్రాథమిక విద్యలో అశోకుడు చెట్లు నాటడంపై ఒక పాఠ్యాంశమే ఉంటుంది. అనాడు మొదలైన చెట్లు నాటడం కొనసాగుతూ వచ్చింది. ప్రధాన రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లు భారీ వృక్షాలుగా ఎదిగి పచ్చదనం, నీడతో కనువిందు చేస్తూ ఉంటాయి. ముఖ్యంగా ఒంగోలు-కర్నూలు రోడ్డుపై పేర్నమిట్ట నుంచి పొదిలి వరకు రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. అయితే, ఆధునిక సమాజంలో వాహనాల రద్దీ పెరగడం, సింగిల్ రోడ్లను డబుల్ చేయడం, ఫోర్ వే, సిక్స్ వే అంటూ రోడ్లను విస్తరిస్తుండటంతో అనేక భారీ వృక్షాలు కనుమరుగైపోతున్నాయి. అయితే, ఒంగోలు - కర్నూలు రోడ్డులో ఒంగోలు సమీపంలోని పేర్నమిట్ట నుంచి పొదిలి, మార్కాపురం, గిద్దలూరు రహదారులు వెంట ఉన్న చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. ఎందుకు ఎండుతున్నాయో కూడా ఎవరికీ అంతుబట్టడం లేదు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు వాటి గురించి కనీసం కూడా పట్టించుకోవడంలేదు. దాంతో ఒంగోలు-చీమకుర్తి మధ్యలోనే దాదాపు 30కిపైగా భారీ వృక్షాలు నిలువునా ఎండిపోయాయి.



రోడ్డు పక్కన ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని మీ కోసంలో జేసీకి వినతిపత్రం అందిస్తున్న పర్యావరణవేత్త శ్రీనివాసరావు (ఫైల్)

ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికుల ఆందోళన...

ఒంగోలు-కర్నూలు రోడ్డులో పేర్నమిట్ట - చీమకుర్తి మధ్యలో రహదారి వెంట ఇరువైపులా ఎండిపోయిన భారీ వృక్షాలు ఉన్నాయి. చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ మొదలుకుని పేర్నమిట్ట వరకు ఎండిపోయిన చెట్లు బొగిలిపోయాయి. ఏ క్షణాన్నైనా విరిగిపడిపోయే స్థితిలో ఉన్నాయి. మొదలుతో సహా విరిగి రోడ్డుకు అడ్డంగా ఎక్కడ పడతాయోనని వాహనదారులు భీతిల్లుతున్నారు. భారీ వృక్షాలు కావడంతో వాహనాల మీద పడితే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో గాలివానలకు ఏ క్షణాన్నైనా చెట్లు విరిగిపడి ఆ సమయంలో ఆ రహదారిపై ప్రయాణించే వాహనాలకు ప్రమాదాలు సంభవించవచ్చని భావిస్తున్నారు. బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలలో ఏ వాహనంపై పడినా ప్రయాణికుల ప్రాణాలు పోయే అవకాశం లేకపోలేదు. గతంలో ఎండిన చెట్ల కొమ్మలు విరిగిపడి ద్విచక్రవాహనదారులకు ప్రమాదాలు జరిగిన సందర్భాలూ కూడా ఉండటంతో వాటిని గుర్తుచేసుకుంటున్న ప్రజలు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మీ కోసం కార్యక్రమంలో అర్జీ...

చీమకుర్తికి చెందిన పర్యావరణ వేత్త, బిల్డింగ్ వర్కర్స్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండా శ్రీనివాసరావు గత సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఎండిపోయి ప్రమాదకరంగా మారిన భారీ చెట్ల గురించి అర్జీ అందజేశారు. ప్రాణాంతక సమస్యపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఆ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే ఆర్అండ్‌బీ ఎస్ఈని పిలిచిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ.. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వారం రోజులు కావస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు ఆ చెట్ల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఫిర్యాదుదారుడు శ్రీనివాసరావు, ప్రయాణికులు వాపోతున్నారు.

ఐకమత్యంతో హక్కుల కోసం పోరాడదాం



కొండలరావును అభినందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు

చీమకుర్తి: అణగారిన కులాల హక్కుల సాధన కోసం ఐకమత్యంతో పోరాటం కొనసాగిద్దామని నూతనంగా ఏర్పడిన కార్యవర్గం తీర్మానించింది. ఆదివారం చీమకుర్తిలోని షేక్ ఖాదర్‌బాషా అనాథ వృద్ధాశ్రమంలో అణగారిన కులాల ఐక్యవేదిక జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బండ్ల కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా కోనేటి చందు, ఉపాధ్యక్షునిగా షేక్ జంషీర్, కార్యదర్శిగా అత్యాల దావీదు, ట్రెజరర్‌గా పాలపర్తి శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావుతో పాటు మాజీ అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు, షేక్ ఖాదర్‌బాషా నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, తెల్లమేకల గాంధీ, చింతకింది అశోక్, ఇస్తర్ల ఏడుకొండలు, చింతలపాలెం బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లింగంగుంటలో రేపు ఉచిత పశువైద్య శిబిరం

మద్దిపాడు: మండలంలోని లింగంగుంట గ్రామంలో ఈ నెల 26వ తేదీ ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మద్దిపాడు పశువైద్యశాఖ ఏఈ పీ కిషోర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భకోశ వ్యాధులతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించనున్నట్లు వెల్లడించారు. గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఎంపిక



గ్రామ కమిటీ నాయకులను అభినందిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ నాగులుప్పలపాడు, ఓబన్నపాలెం గ్రామాల నూతన కమిటీలను ఆదివారం ఎంపిక చేశారు. పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో కమిటీలను నియమించారు. నాగులుప్పలపాడు గ్రామ అధ్యక్షునిగా మారెళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా అత్తంటి రఘుబాబు, పీకా సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా పీకా వెంకట్రావు, ప్రతాప్‌రెడ్డి, రావిపాటి వెంకట్రావు, రాంబాబుతో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఓబన్నపాలెం గ్రామాధ్యక్షునిగా కట్టా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పోలినేని రామకృష్ణ, పోలినేని రేవతి, ప్రధాన కార్యదర్శిగా బెల్లంకొండ సాయి, మరికొందరు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా వెంకయ్య స్వామి ఆరాధన



ప్రత్యేక అలంకరణలో వెంకయ్యస్వామి

ఒంగోలు మెట్రో: భగవాన్ గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు సంతపేటలోని వెంకయ్యస్వామి మందిరంలో మందిర నిర్వాహకుడు ఆవుల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఉదయం సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి అర్చన, పూజా క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి మంగళహారతులు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శిగా మస్తాన్



మస్తాన్‌ను అభినందిస్తున్న మేరుగు నాగార్జున, పార్టీ నాయకులు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల ప్రధాన కార్యదర్శిగా షేక్ మస్తాన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జునను పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మస్తాన్‌ను మంత్రి అభినందిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను శక్తివంచన లేకుండా నెరవేరుస్తానని మస్తాన్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, కోఆప్షన్ మెంబర్ మూసా, నాయకులు మోరబోయిన సంజీవరావు, మద్దా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌బో ఆఫ్ ఆర్టికల్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పారిశ్రామికవేత్త శిద్దా హనుమంతరావు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): రిటైర్డ్ ప్రిన్సిపాల్ గల్లా గోవిందయ్య అంతర్జాతీయ స్థాయిలో రచించిన రెయిన్‌బో ఆఫ్ ఆర్టికల్స్ నూతన పుస్తకాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, కృష్ణసాయి గ్రానైట్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ శిద్దా హనుమంతరావు ఆదివారం ఆవిష్కరించారు. సంతనూతలపాడు మండలం గుడిపాడుడొంక సమీపంలోని కృష్ణసాయి గ్రానైట్ ఫ్యాక్టరీలో నిర్వహించిన చీమకుర్తి హైస్కూల్ పదో తరగతి 1979-80 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుకల్లో భాగంగా పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గురువులు రచించిన ఇంగ్లిష్ పుస్తకాన్ని శిష్యుడుగా తాను ఆవిష్కరించే భాగ్యం లభించడం ఎంతో అభినందనీయమని శిద్దా హనుమంతరావు అన్నారు. అనంతరం గోవిందయ్యను శిద్దా హనుమంతరావు, పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏ శివకోటేశ్వరరావు, షేక్ కాజామొహిద్దీన్, గాదంశెట్టి దామోదర్రావు, డి.వి.రామాంజనేయులు, చాట్ల వెంకటేశ్వర్లు, సీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని గొంగడిరెడ్డిపాలెం, వర్ధినేనివారిపాలెంలో ఆదివారం శ్రీకృష్ణునికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా గొంగడి రెడ్డిపాలెంలో కృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి చివరి రోజు గ్రామోత్సవం నిర్వహించారు. ఇందూ జ్ఞానవేదిక ఒంగోలు కమిటీ అధ్యక్షుడు మునగపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లకు లీకులు.. వాహనాలకు బ్రేకులు..!

- లీకులకు మరమ్మతుల కోసం రోడ్లపై గుంతలు తీసి నిర్లక్ష్యంగా వదిలేస్తున్న నగరపాలక సంస్థ యంత్రాంగం
- అవస్థపడుతున్న వాహనదారులు
- రాత్రివేళల్లో గమనించకుంటే పొంచి ఉన్న ప్రమాదాలు

ఒంగోలు వన్‌టౌన్:

ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం నగరంలోని వాహనదారుల పాలిట శాపంగా మారుతోంది. నగరంలో మంచినీటి పైపులైన్లకు లీకులు ఏర్పడటం.. తూతూమంత్రంగా మరమ్మతులు చేయడం.. మళ్లీ లీకులు ఏర్పడటం ఎప్పటి నుంచో జరుగుతూనే ఉంది. అయితే, ఆ లీకులకు మరమ్మతులు చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది రోడ్లపై గుంతలు తీస్తున్నారు. వాటిని వెంటనే పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ పూడ్చినప్పటికీ పైపైన మట్టివేసి వదిలేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో గుంతలు పడటం, లేకుంటే మట్టికుప్పలు అలాగే ఉండటంతో వాహనదారులకు తలనొప్పిగా మారుతున్నాయి. కొన్నిచోట్ల సుమారు 10 అడుగుల వెడల్పుతో గుంతలు తవ్వి మొక్కుబడిగా పూడ్చి వదిలేస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. కొన్నిచోట్ల చిన్నపాటి కొండలా మట్టి తోలి వదిలేస్తుండటంతో వాహనదారులు అవస్థపడుతున్నారు. ఒంగోలు నగరంలోని అన్నవరప్పాడు పార్కు సమీపంలో ఇదేవిధంగా మంచినీటి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేసేందుకు తవ్విన గుంతను సక్రమంగా పూడ్చకపోవడంతో రోడ్డు మధ్యలో గుంత పడింది. ఈ రోడ్డుపై వెళ్లే స్కూల్ బస్సులు, ఆటోలు, కార్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొరపాటున టైరు గుంతలో దిగితే కూరుకుపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే జేసీబీ, ట్రాక్టర్ లాంటి వాహనాలు తెచ్చి లాగితేగానీ బయటకు వచ్చే పరిస్థితి లేదు. అదేవిధంగా సంతపేట పశువైద్యశాల సమీపంలోనూ మంచినీటి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేసేందుకు రోడ్డు మధ్యలో గుంత తవ్విన నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది దాన్ని తిరిగి పూడ్చడంలో నిర్లక్ష్యం వహించారు. ఆ గుంతపై కొండలా మట్టి వేయడంతో రోడ్డు పక్క నుంచి వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రద్దీగా ఉండే రోడ్లపై సైతం గుంతలు తవ్వి పాడుచేసి మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తుండటంతో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈ పద్ధతి మార్చుకుని నగరంలోని మంచినీటి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేసేందుకు తవ్విన గుంతలను సక్రమంగా పూడ్చివేసి వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



అన్నవరప్పాడు పార్కు సమీపంలో రోడ్డుపై గుంత తవ్వి సక్రమంగా పూడ్చని దృశ్యం



సంతపేటలో తవ్విన గుంతపై కుప్పలా పోసి వదిలేసిన మట్టి

బాలవిహార్‌కు విశేష స్పందన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరిలోని చిన్మయ మిషన్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం సహకారంతో ప్రారంభించిన బాలవిహార్ వారాంతపు కార్యక్రమానికి బాలల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం అధిక సంఖ్యలో బాలలు పాల్గొనగా, ఆధ్యాత్మిక విద్యతో పాటు వినోదాన్ని పంచే కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎస్పీ కె.నాగేశ్వరరావు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. పిల్లలు రామాయణంలోని పాత్రలను చిత్రాలుగా గీసి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. ఇతిహాసంపై తమకున్న అవగాహనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించి పిల్లల నైతిక విలువలు, శ్రేయస్సును పెంపొందించే లక్ష్యంతో సాగుతోందని నిర్వాహకులు తెలిపారు.